# నౌకా నిర్మాణంపై దక్షిణ కొరియా ఆసక్తి

## సీఎం చంద్రబాబుతో పారిశ్రామికవేత్తల బృందం భేటీ

**అమరావతి, ఆంధ్రప్రభ** : నౌకా నిర్మాణ రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి దక్షిణ కొరియా సంస్థలు ఆసక్తిని కనబర్చాయి. నీటిని శుద్ధిచేసే ప్రక్రియలో తాము అభివృద్ధి చేసిన సాంకేతికతను అందించేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశాయి. దక్షిణ కొరియాలో భారత కాన్సుల్ జనరల్‌గా ఉన్న జియాంగ్ డాక్ మిన్ నేతృత్వంలో అమరావతికి వచ్చిన 20 మంది దక్షిణ కొరియా పారిశ్రామికవేత్తల బృందం సోమవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రజావేదిక సమావేశ మందిరంలో కలిశారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. ప్రముఖ పారిశ్రామిక నగరం బూసాన్ నుండి వచ్చిన పలువురు పారిశ్రామికవేత్తలు ఈ బృందంలో ఉన్నారు. ఏపీలో ఆహార, వస్త్ర తయారీ పరిశ్రమలు, నౌకా నిర్మాణం, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ రంగాలపై ప్రధానంగా వీరు దృష్టిపెట్టారు. ముఖ్యమంత్రిని కలవడానికి ముందు వీరు సచివాలయంలోని వివిధ శాఖలకు చెందిన కార్యదర్శులు, అధికారులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని వ్యాపార అవకాశాల గురించి తెలుసుకున్నారు.దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ ఏపీలో అనేక ఓడరేవులను అభివృద్ధి చేస్తున్న తరుణంలో నౌకా నిర్మాణంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం అభిలాషనీయమన్నారు. ప్రపంచస్థాయిలో మెగా పోర్టులతో సముద్ర రవాణాలో అతిపెద్ద లాజిస్టిక్స్ కేంద్రంగా ఉన్న బూసాన్ నుండి వచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టడం రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. సముద్ర రవాణా దేశంలో రెండో స్థానం సాధించామని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో జలమార్గాలను అభివృద్ధి చేస్తున్నామని, ఇక్కడి నుండి మూడు రాష్ట్రాలకు కాలువల ద్వారా సరకు రవాణా చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి కార్యనిర్వాహకాధికారి జాస్తి కృష్ణకిషోర్ తొలుత కొరియా పారిశ్రామిక వేత్తలను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ఏపీ తమను బాగా ఆకర్షించిందని, ఆహార, వస్త్ర తయారీ రంగాలతోపాటు అపెరల్-టెక్స్‌టైల్ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి తగిన వ్యూహాలతో వస్తామని బృందంలోని సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. బూసాన్, ఏపీల మధ్య బలమైన ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాల కోసం చొరవ చూపాలని జింగ్ డెక్ మిన్ ముఖ్యమంత్రిని కోరారు. సమావేశంలో పరిశ్రమల శాఖామంత్రి ఎన్ అమర్నాథ రెడ్డి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి సాయిప్రసాద్, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

